తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
శనివారం
05 సెప్టెంబర్ 2026
Follow :

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్
- 1000 రోజుల ప్రజా పాలనపై ఘనంగా బైక్ ర్యాలీ..
- సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటాలకు పూలాభిషేకం







**కీసర, సెప్టెంబర్ 04 (జనంసాక్షి) :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల ప్రజా పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని నాగారం, దమ్మాయిగూడ, కీసర, చంద్రపురి కాలనీ, జవహర్‌నగర్ డివిజన్ల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. రాంపల్లి చౌరస్తా నుంచి జవహర్‌నగర్ అంబేద్కర్ విగ్రహం వరకు సాగిన ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీకి మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, మేడ్చల్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జవహర్‌నగర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సంక్షేమం, అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు.
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఆరు గ్యారంటీల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి వంటి పథకాలతో ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం కలుగుతోందని చెప్పారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల ద్వారా సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజల్లో ఉండాలని సూచించారు. మల్కాజ్‌గిరి కార్పొరేషన్ పరిధిలో రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని వజ్రేష్ యాదవ్ తెలిపారు. 1000 రోజుల ప్రజా పాలనలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

చిత్రపటాలకు పూలాభిషేకం

బైక్ ర్యాలీ అనంతరం నాగారం డివిజన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పూలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల ప్రజా పాలనలో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కీసర డివిజన్ అధ్యక్షురాలు రామిడి స్వప్న విజయ్‌రెడ్డి, దమ్మాయిగూడ డివిజన్ అధ్యక్షుడు ముప్పా రామారావు, నాగారం డివిజన్ అధ్యక్షుడు భూమయ్య యాదవ్, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన నేరేడ్‌మెట్ మాజీ కార్పొరేటర్ భర్త ఉపేందర్ రెడ్డి



**మల్కాజిగిరి సెప్టెంబర్ 4 (జనం సాక్షి) :** నేరేడ్‌మెట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మీనా ఉపేందర్ రెడ్డి భర్త, భాజపా నాయకులు ఉపేందర్ రెడ్డి ఆ పార్టీకి వీడ్కోలు పలికారు.తన ముఖ్య అనుచరులతో కలిసి ఆయన మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మైనంపల్లి ఆయనకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు, మైనంపల్లి హనుమంతరావు నాయకత్వ శైలి పట్ల ఆకర్షితుడై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు.నేరేడ్‌మెట్ డివిజన్ సర్వతోముఖాభివృద్ధికి, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఏకే మురుగేష్, ఎస్ ఆర్ ప్రసాద్, ఉత్తమ్ రెడ్డి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, డివిజన్ స్థాయి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు. ఉపేందర్ రెడ్డి రాకతో డివిజన్‌లో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది.

## భార్యపై పెట్రోల్ పోసి నిప్పంటించిన భర్త

**బోడుప్పల్-జనంసాక్షి**
అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తూ, చివరకు ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం.. మీర్‌పేట్‌లోని బాలాజీ టౌన్‌షిప్‌కు చెందిన రత్నవత్ అనిత (21)కు లుడావత్ లాలుతో 2023లో ప్రేమ వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల కుమార్తె ఉంది.గత రెండు నెలలుగా భర్త అదనపు కట్నం కోసం తనను వేధిస్తున్నాడని అనిత ఆరోపించింది. దీంతో నెల రోజుల క్రితం కుమార్తెతో కలిసి చెంగిచెర్ల ఆర్టీసీ కాలనీలోని పుట్టింటికి వెళ్ళి ఉంటుంది. ఈ క్రమంలో సెప్టెంబర్ 2న భర్త వచ్చి కుమార్తెను తన వెంట తీసుకెళ్లాడు. మరుసటి రోజు ఉదయం మళ్లీ అత్తింటికి వచ్చిన లాలు.. సాయంత్రం 3.30 గంటల సమయంలో మనవరాలు ఆచూకీపై అనిత తండ్రి ప్రశ్నించడంతో ఆగ్రహానికి గురయ్యాడు.మంచం కింద నుంచి పెట్రోల్ తీసి అనిత శరీరంపై పోసి నిప్పంటించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కుమార్తెను కాపాడేందుకు ప్రయత్నించిన అనిత తల్లికి కూడా మంటలు అంటుకున్నాయి. వెంటనే ఆమె తండ్రి మంటలను ఆర్పి, అనితకు ప్రాథమికంగా ఉపశమనం కల్పించి 108 అంబులెన్స్ ద్వారా గాంధీ ఆసుపత్రికి తరలించారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అనిత నుంచి మేజిస్ట్రేట్ వాంగ్మూలం నమోదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.నిందితుడిపై తదుపరి చర్యలు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## హామీలు అమలు చేయడంలో విఫలం చెందారు

**మహేశ్వరంలో ర్యాలీ నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు**



**మహేశ్వరం,ఆగస్టు4(జనంసాక్షి):**కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం రేవంత్ రెడ్డి విఫలం చెందారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అధ్యక్షుడు రాజు నాయక్ అన్నారు.శు క్రవారం మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు మహేశ్వరం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి 1000 రోజుల పాలనను నిరసిస్తూ వంటావార్పు,మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజు నాయక్ మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి 1000 రోజుల పాలనలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో చెప్పిన హామీలలో ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరుపున పోరాడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పాండు యాదవ్,వైస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి,బీఆర్ఎస్ పార్టీ నాయకులు కర్రోల్ల చంద్రయ్య ముదిరాజు,పోతర్ల అంబయ్య యాదవ్,పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హెడ్ కానిస్టేబుల్ జంగయ్యకు ఏఎస్ఐగా పదోన్నతి



**మల్కాజిగిరి సెప్టెంబర్ 4 (జనం సాక్షి) :** మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌లో గత ఆరు సంవత్సరాలు హెడ్ కానిస్టేబుల్‌గా సేవలందిస్తున్న వై. జంగయ్య అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ)గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా స్టేషన్ సిఐ విజయ్‌కుమార్ ఆయన భుజాలపై ఏఎస్ ఐ స్టార్లను అలంకరించి, ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం స్టేషన్ ఎస్ ఐ, పోలీస్ సిబ్బంది జంగయ్యకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ శాఖలో 27 ఏళ్ల సుదీర్ఘ సర్వీసు అనంతరం తనకు ఈ పదోన్నతి లభించిందని జంగయ్య పేర్కొన్నారు. ఈ పదోన్నతి తనపై బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో ప్రజలకు మరింత ఓపికతో, అంకితభావంతో సేవలందిస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. విధి నిర్వహణలో నిబద్ధతతో వ్యవహరిస్తూ అందరి మన్ననలు పొందిన జంగయ్యను పలువురు ప్రశంసించారు.

# కొడంగల్‌కు సీఎం రేవంత్.. లాగచర్ల సురేష్ ముందస్తు అరెస్ట్



**ధారూర్, సెప్టెంబర్ 4(జనంసాక్షి) :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో రెండు రోజుల పర్యటనకు రానున్న నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా లాగచర్ల సురేష్‌ను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి ధారూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించరు. సురేష్‌ను అరెస్ట్ చేసిన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు ధారూర్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా చిన్నయ్యగౌడ్, అంజయ్య, హఫీజ్, జైపాల్‌రెడ్డి, పోటారి మహేష్, శశాంక్, భీమ్‌సేన్, కే. మహేష్ తదితరులు సురేష్‌ను కలిసి వివరాలు తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగానే సురేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో ధారూర్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

### ఈసీఐఎల్ నారాయణ సీబీఎస్‌సి పాఠశాలలో

# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**కాప్రా, సెప్టెంబర్ 4 (జనం సాక్షి ) :** ఈసీఐఎల్ లో నారాయణ సి బి ఎస్ సి పాఠశాలలో ప్రిన్సిపల్ మంజు భార్గవి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏజీఎం పురుషోత్తం రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణుని తత్వం గురించి తెలిపారు. మహాభారతంలోని కురుక్షేత్రంలో కృష్ణుడు నిర్వహించిన పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో పరిగెడుతున్న ఈ రోజుల్లో విద్యార్థులకు సంస్కృతి సంప్రదాయాల గురించి, ఇతిహాసాల గురించి తెలియవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థుల ఉత్సాహాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మంజు భార్గవి మాట్లాడుతూ శ్రీకృష్ణుని భగవద్గీత సారాంశం ఎంతో గొప్పది అన్నారు. భగవద్గీతలోని మార్గాలను అనుసరిస్తూ విద్యార్థులు ధైర్యంగా ముందుకు సాగాలని తెలిపారు. ఓటమిని అంగీకరిస్తూ, గెలుపు కోసం పాటుపడాలని విద్యార్థులకు ప్రేరణ కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు ,తదితరులు పాల్గొన్నారు.

# భారతదేశం విశ్వగురువుగా మారడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

### ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యవాహ కాచం రమేష్



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 4(జనం సాక్షి ) :** భారతదేశం త్వరలో విశ్వగురువుగా మారడంలోనూ, సమాజంలో నెలకొన్న రుగ్మతలను తొలగించి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలోనూ ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత కార్యవాహ కాచం రమేష్ అన్నారు. ప్రపంచంలో అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి అత్యంత గొప్పదని ఆయన కొనియాడారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న 90 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కాచం రమేష్ మాట్లాడుతూ... దేశాభివృద్ధికి ఉపాధ్యాయుల కృషి ఎంతో అవసరమన్నారు. తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య మాట్లాడుతూ, సమాజానికి విశేష సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను ఎంపిక చేసి సన్మానించే గొప్ప కార్యక్రమాలను తపస్ నిరంతరం నిర్వహిస్తుందని పేర్కొన్నారు. తపస్ సంఘటన కార్యదర్శి కానుగంటి హనుమంతరావు మాట్లాడుతూ... సమాజంలో ఏ విధమైన మార్పు తీసుకురావాలన్నా అది ఉపాధ్యాయులతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. విద్యార్థులను ఛత్రపతి శివాజీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, స్వామి వివేకానంద, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి వీరులుగా, జాతీయ భావాలు కలిగిన పౌరులుగా తీర్చిదిద్దే మహత్తర బాధ్యత ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో సన్మాన గ్రహీతలతో పాటు తపస్ రాష్ట్ర, జిల్లా, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మరియు కార్యకర్తలు కలిపి సుమారు 250 మంది పాల్గొన్నారు.

# వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

### సీఐ కట్టా నరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ యాదగిరి




**చేవెళ్ల, సెప్టెంబర్ 04 (జనంసాక్షి)** గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించాలని చేవెళ్ల సీఐ కట్టా నరేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ యాదగిరి సూచించారు. శుక్రవారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని ఇబ్రహీంపల్లి వార్డులో అట్లాస్ ఫంక్షన్ హాల్‌లో గణేష్ మండపాల నిర్వాహకులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కట్టా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గణేష్ మండపాల వద్ద భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మండపాల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను ముందుగానే తీసుకోవాలని, పోలీసుల సూచనలు, నిబంధనలను పాటిస్తూ ఉత్సవాలను నిర్వహించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులు లేదా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటే వెంటనే డయల్ 112తో పాటు సంబంధిత పోలీస్ స్టేషన్ నం. 8172663449 కు సమాచారం అందించాలని సూచించారు. మండపంలోని పాయింట్ బుక్‌లో పోలీస్ స్టేషన్, పోలీస్ సిబ్బంది ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచాలని, పోలీసులు మండపాలను సందర్శించినప్పుడు పాయింట్ బుక్‌ను అందించి సహకరించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ యాదగిరి మాట్లాడుతూ.. గణేష్ మండపాల ఏర్పాటులో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. అన్ని గణేష్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను 2026 సెప్టెంబర్ 25లోపు పూర్తి చేయాలని సీఐ నరేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరిగేలా నిర్వాహకులు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రవీందర్ నాయక్, వెంకటేష్, వనం శిరీష, బేగరి శిరీష, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలు హిందువుల ఐక్యతకు ప్రతీక

### వైభవంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలి

### భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ ఆకుల సతీష్



**నిజాంపేట్ సెప్టెంబర్ 4 జనంసాక్షి :** సనాతన హిందూ ధర్మంలో వినాయక చవితి, 11 రోజుల గణేష్ ఉత్సవాలు హిందువుల ఐక్యత, సామరస్యానికి ప్రతీకలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ ఆకుల సతీష్ అన్నారు. రాబోయే వినాయక చవితి ఉత్సవాలను కుత్బుల్లాపూర్ అసెంబ్లీ పరిధిలో ఘనంగా, ప్రశాంతంగా నిర్వహించడంతో పాటు మండపాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన తెలిపారు. ఈ మేరకు చింతల్‌లోని జై కన్వెన్షన్ బ్యాంక్వెట్ హాల్లో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో డివిజన్ కమిటీల విస్తృత స్థాయి సమావేశం అసెంబ్లీ కన్వీనర్ ఆకుల సతీష్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి సమితి సెంట్రల్ కమిటీ సెక్రటరీ రమేష్ బాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత 49 సంవత్సరాలుగా హైదరాబాద్‌లో గణేష్ ఉత్సవాల విజయవంతమైన నిర్వహణకు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కృషి చేస్తోందని ఆయన తెలిపారు. కుత్బుల్లాపూర్ పరిధిలో కూడా దేవాలయాలు, వినాయక మండపాల నిర్వాహకులు, వివిధ హిందూ సంఘాలు, కాలనీల పెద్దలతో సమన్వయం చేసుకుని హిందువులందరినీ సంఘటితం చేయాలని పిలుపునిచ్చారు. అన్ని డివిజన్లలో కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసి బలమైన హిందూ ఐక్యతను చాటాలని సూచించారు. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ, గత రెండు సంవత్సరాలుగా మండప నిర్వాహకులు, అధికారులు, వివిధ శాఖలతో సమన్వయం చేసుకుంటూ గణేష్ ఉత్సవాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అసెంబ్లీ పరిధిలో 8 మంది కో-కన్వీనర్లు, 11 డివిజన్ కన్వీనర్లు, డివిజన్ కమిటీలను ఏర్పాటు చేయడంతో పాటు 9 నిమజ్జన పాయింట్ల వద్ద ప్రత్యేక బాధ్యులను నియమించి అధికారులతో సమన్వయం చేస్తున్నామని తెలిపారు రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, నిమజ్జన పాయింట్ల వద్ద అవసరమైన అన్ని ఏర్పాట్లు ఈ నెల 10వ తేదీలోపు పూర్తి చేయాలని అధికారులను కోరామని తెలిపారు. వినాయక మండపాల ఏర్పాటు, విద్యుత్, పోలీస్ అనుమతుల విషయంలో నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కో-కన్వీనర్లు జై శంకర్, కట్ట కుమార్, పులి బలరాం, గరిగే శేఖర్, అరుణ్ రావు, మల్లారెడ్డి, మహిళా ఇన్‌చార్జ్ సుహాసిని శక్తి, లీగల్ ఇన్‌చార్జ్ శివానంద్, కో-ఇన్‌చార్జ్ కోడి ఆదిత్య, డివిజన్ కన్వీనర్లు పొలబోయిన శ్రీనివాస్, కృష్ణారెడ్డి, సతీష్ సాగర్, నాగరాజు, విఘ్నేష్ ముదిరాజు, రామ్ సాయి యాదవ్, శంకర్, పరుశు వేణు, మాధవులు, శరత్ గౌడ్, పెద్దలు కంది శ్రీరాములు, వేణుగోపాల్, వేణు గౌడ్, వివిధ డివిజన్ల కో కన్వీనర్లు మరియు ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# 6 గ్యారెంటీలు..అమలు సున్నా

## కాంగ్రెస్ ప్రభుత్వంపై జక్క వెంకట్ రెడ్డి ధ్వజం



**బోడుప్పల్-జనంసాక్షి :** ఎన్నికల సమయంలో 6 గ్యారెంటీలు, 420 హామీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించి మోసపూరిత పాలన సాగిస్తోందని పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆరోపించారు.బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు పీర్జాదిగూడలో నిర్వహించిన కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల వైఫల్యాల నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా వంటా-వార్పు కార్యక్రమాలు, నిరసన ప్రదర్శనలు,సదస్సులు నిర్వహించి ప్రభుత్వ విధానాలను తీవ్రంగా ఎండగట్టారు. మహిళలు పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు.ఎన్నికల ముందు మహిళల ఓట్ల కోసం హామీల వర్షం కురిపించిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా ప్రజలను నిరాశపరిచిందని జక్క వెంకట్ రెడ్డి విమర్శించారు. ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, కళ్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం, దివ్యాంగులకు రూ.6,000 పింఛన్, మహిళలకు స్కూటీలు తదితర హామీల అమలు ఎక్కడ జరిగిందని ప్రశ్నించారు.ఓట్ల కోసం హామీలు ఇవ్వడం,అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారింది. తెలంగాణ ప్రజలు అమాయకులు కాదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని గుర్తుంచుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ దగా పాలనను ప్రజలకు వివరిస్తూ ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని, భవిష్యత్తులో మరింత ఉధృతంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని జక్క వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి,మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్,లేతాకుల మాధవి రఘుపతి రెడ్డి,మధుసూదన్ రెడ్డి,కౌడే పోచయ్య,వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి,మహిళా అధ్యక్షురాలు నిర్మల,యూత్ అధ్యక్షుడు ప్రభు,సీనియర్ నాయకులు, మహిళా నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భక్తి పారవశ్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

### కృష్ణుడు, గొల్లభామల వేషధారణలో చిన్నారుల సందడి

### ఆటపాటలతో అలరించిన బాలబాలికలు

**కోట్‌పల్లి, సెప్టెంబర్ 4 (జనంసాక్షి):** కోట్‌పల్లి మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలు, పాఠశాలలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. చిన్నారులు శ్రీకృష్ణుడు, గొల్లభామల వేషధారణలో ముస్తాబై ఆటపాటలతో సందడి చేస్తూ చూపరులను ఆకట్టుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు శ్రీకృష్ణుడి జీవిత విశేషాలను ప్రతిబింబించేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారుల వేషధారణలు, పాటలు, నృత్యాలతో వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను కృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో తీర్చిదిద్ది వేడుకల్లో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మండలంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గోపూజ, గణపతి పూజతో పాటు శ్రీకృష్ణ స్వామి మూలవిరాట్‌కు ఫల, పంచామృత అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం అర్చనలు, విశేష పూజలు, మంత్రపుష్పం,



మహా మంగళహారతి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హనుమాన్ ఆలయంలోనూ చిన్నారులు, వారి తల్లిదండ్రులు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణాల్లో మార్మోగిన హరినామ సంకీర్తనలు భక్తులను ఆధ్యాత్మిక పారవశ్యంలో ముంచెత్తాయి. శ్రీకృష్ణుని జన్మదినాన్ని పురస్కరించుకుని భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో కోట్‌పల్లి మండలంలో ఎటుచూసినా కృష్ణనామస్మరణ, భక్తిగీతాలు, చిన్నారుల సందడితో పండుగ వాతావరణం నెలకొంది.



# ఇది బస్టాండా..? చెత్త స్టాండా?

### తాండూర్ బస్టాండ్, డిపో ఆవరణలో నరక ప్రాయం

### ప్రధాన కాలనీలోని మురుగు నీరు డిపోలోకి..

**యాలాల్, తాండూర్ సెప్టెంబర్ 4 ( జనం సాక్షి యాలాల ప్రతినిది ) :** అది నిత్యం వేలాది మంది ప్రయాణికులు, విద్యార్థులతో కిటకిటలాడే తాండూర్ ఆర్టీసీ బస్టాండ్ మరియు డిపో ఆవరణ. కానీ నేడు అక్కడ నెలకొన్న పరిస్థితులు చూస్తుంటే.. "ఇది బస్టాండా? లేక చెత్త స్టాండా?" అనే ప్రశ్న సామాన్య జనం నుంచి వ్యక్తమవుతోంది. అధికారుల తీవ్ర నిర్లక్ష్యం కారణంగా తాండూర్ బస్టాండ్, డిపో ఆవరణ ప్రస్తుతం నరక ప్రాయంగా మారింది. ప్రయాణికులు లోపలికి అడుగు పెట్టాలంటేనే జంకే పరిస్థితి దాపురించింది.

చెరువులా మారిన ముందు భాగం : మురుగునీటిమయంపట్టణంలోని ప్రధాన కాలనీల నుంచి వస్తున్న మురుగు నీరంతా సక్రమమైన కాలువల వ్యవస్థ లేకపోవడంతో నేరుగా డిపోలోకి ప్రవహిస్తోంది. దీంతో బస్టాండ్ ముందు భాగం అంతా మురుగు నీటితో నిండిపోయి, ఒక పెద్ద చెరువును తలపిస్తోంది. ఈ మురుగు నీటి గుండానే ప్రయాణికులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు నానా అవస్థలు పడుతూ నడవాల్సి వస్తోంది. దుర్వాసన భరించలేక ముక్కులు మూసుకుని ప్రయాణం సాగిస్తున్నారు.

కంపు కొడుతున్న ఆవరణ : సిబ్బంది నిర్వాకం వల్ల ఆర్టీసీ ఆవరణ అంతా వ్యర్థ పదార్థాలు పేరుకు పోయి తీవ్రంగా కంపు కొడుతోంది. విచిత్రం ఏమిటంటే.. ఎక్కడో ఉన్న చెత్తను తెచ్చి ఇక్కడ వేయడం కాదు, బస్టాండ్ ప్రధాన స్థలంలోనే వ్యర్థ పదార్థాలను ఆర్టీసీ సిబ్బంది స్వయంగా డంపింగ్ చేస్తుండటం ఇక్కడి దారుణ పరిస్థితికి అద్దం పడుతోంది. పారిశుద్ధ్యాన్ని పర్యవేక్షించాల్సిన ఆర్టీసీ సిబ్బందే చెత్తను కుప్పలుగా పోస్తుంటే, ఇటు మున్సిపల్ అధికారులు, అటు ఆర్టీసీ ఉన్నత అధికారులు మాత్రం ఏమీ పట్టనట్లు చోద్యం చూస్తూ కూర్చోవడంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



తప్పని ఇక్కట్లు : ఈ భయానక వాతావరణం దారుణమైన పరిస్థితుల వల్ల నిత్యం ప్రయాణించే ప్రయాణికులకు, విద్యార్థులకు మాత్రమే కాకుండా అక్కడ విధులు నిర్వహించే ఆర్టీసీ సిబ్బందికి కూడా ఇక్కట్లు తప్పడం లేదు. దీనికి తోడు బస్టాండ్ ఇన్ గేట్, అవుట్ గేట్ వద్ద రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారిపోయింది. బస్సులు లోపలికి వచ్చేటప్పుడు, బయటకు వెళ్లేటప్పుడు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని ఒక భయానక వాతావరణం అక్కడ నెలకొంది.

ఆటోల వేట : ప్రతి పార్కింగ్ లేక డ్రైవర్ల ఆవేదనబస్టాండ్ పరిధిలో ఆటోలకు ప్రత్యేకంగా పార్కింగ్ స్థలం లేకపోవడంతో రద్దీ మరింత పెరుగుతోంది. బస్సులు తిరిగే మార్గంలో, బస్సుల మధ్యే ఆటో డ్రైవర్లు ప్రయాణికుల కోసం వేట సాగించాల్సి వస్తోంది. నిజానికి బస్టాండ్ ఆవరణలో ఆటోల పార్కింగ్ కి తగినంత స్థలం అందుబాటులో ఉంది. కానీ, అక్కడ ఆటోలను పార్కింగ్ చేసుకోవడానికి అధికారులు నిరాకరిస్తున్నారని ఆటో డ్రైవర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పట్టింపు లేని వైఖరి వల్లే తాము బస్సుల మధ్య ఆటోలు పెట్టాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.ఇప్పటికైనా మున్సిపల్, ఆర్టీసీ ఉన్నతాధికారులు నిద్ర మత్తు వీడి, తక్షణమే స్పందించి తాండూర్ బస్టాండ్ కు నరక ప్రాయం నుంచి విముక్తి కల్పించాలని ప్రయాణికులు, జనం డిమాండ్ చేస్తున్నారు.



# ఘనంగా అన్నోజు కృష్ణచారి జన్మదిన వేడుకలు

### విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం నేతలు, శ్రేయోభిలాషుల శుభాకాంక్షల వెల్లువ

**బోడుప్పల్-జనంసాక్షి :** తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నోజు కృష్ణ చారి జన్మదిన వేడుకలు హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆయనకు సంఘ నాయకులు,శ్రేయోభిలాషులు, అభిమానులు కృష్ణ చారికి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సమాజ ఐక్యత, అభివృద్ధి, సంక్షేమం కోసం అన్నోజు కృష్ణ చారి చేస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు.సమాజ హక్కుల సాధనతో పాటు సంఘ బలోపేతానికి ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు ఎదిగి సమాజ సేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.పుట్టినరోజు సందర్భంగా తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ అన్నోజు కృష్ణ చారి కృతజ్ఞతలు తెలియజేశారు.అందరి ఆశీస్సులు, సహకారంతో సమాజ అభ్యున్నతి కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.ఈ వేడుకల్లో సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,కుమార్ గౌడ్,కొండోజు అశోక్,మారోజు లక్ష్మీనారాయణ,అన్నోజు మదన చారి, మహంకాళీ నర్సింహ చారి,మంకోజు బాలాచారి,సుదగానీ హరీష్ తదితరులు పాల్గొన్నారు

# శ్రీకృష్ణుడి బోధనలు నేటి సమాజానికి మార్గదర్శకం

### పీసీసీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కోట నీలిమ



అమీర్‌పేట (జనంసాక్షి) : శ్రీకృష్ణ పరమాత్ముడు భగవద్గీత ద్వారా మానవాళికి అందించిన బోధనలు నేటి సమాజానికి సైతం మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పీసీసీ వైస్ ప్రెసిడెంట్, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ అన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా బంజారాహిల్స్‌లోని హరే కృష్ణ గోల్డెన్ టెంపుల్‌ను ఆమె సందర్శించారు. ఆలయ పబ్లిక్ రిలేషన్స్ ఇన్‌చార్జి రవి లోచన స్వామీజీ, ఆలయ నిర్వాహకుల ఆహ్వానం మేరకు ఆలయానికి చేరుకున్న డాక్టర్ కోట నీలిమకు నిర్వాహకులు సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీకృష్ణ పరమాత్మను, స్వయంభూ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జన్మాష్టమి ధర్మం, సత్యం, న్యాయం పట్ల నిబద్ధతను పెంపొందించే పవిత్రమైన పర్వదినమన్నారు. కష్టసమయాల్లో ధైర్యంగా నిలబడటం, కర్తవ్యాన్ని నిష్టతో నిర్వర్తించడం, ఫలితాన్ని ఆశించకుండా ధర్మబద్ధంగా ముందుకు సాగడం వంటి విలువలను శ్రీకృష్ణుడి బోధనలు నేర్పుతున్నాయని తెలిపారు. శ్రీకృష్ణుడి జీవితం ప్రేమ, స్నేహం, కరుణ, ధర్మం, కర్తవ్యనిష్ఠ, ప్రజా సంక్షేమానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, పరస్పర గౌరవం, మానవతా విలువలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. యువత శ్రీకృష్ణుడి బోధనలను స్ఫూర్తిగా తీసుకుని క్రమశిక్షణ, బాధ్యత, నిబద్ధతతో భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. జన్మాష్టమి సందర్భంగా ప్రజలందరికీ డాక్టర్ కోట నీలిమ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకృష్ణ పరమాత్మ, శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సౌభాగ్యం, ఆరోగ్యం, ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.



# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**బీఆర్ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి**

**వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ నిరసన**

**ఖైరతాబాద్, సెప్టెంబర్ 04 (జనం సాక్షి)** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ ఖైరతాబాద్ నియోజక వర్గ ఇన్‌చార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి(ఎంజీఆర్) విమ ర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసి స్తూ ఖైరతాబాద్ నియోజకవర్గం రాజ్‌భవన్ రోడ్డు లోని స్కోడా షోరూం సమీపంలో నిర్వహించిన వంటావార్పు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అన్ని డివిజన్ల అధ్యక్షులు, ఉద్యమకారులు, సీని యర్ నాయకులు, మహిళా నాయకులు, బీఆ ర్ఎస్ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలను 420 హామీలు, వివిధ డిక్లరేషన్లు, గ్యా రంటీల పేరుతో నమ్మించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు ఆ హామీలను విస్మరించిందని ఆరోపించారు. 22-ఏ నిషేధిత భూముల సమస్య పరిష్కారం, మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధు లు, వికలాంగులకు ఇచ్చిన హామీల అమలు ఏ మైందని ప్రశ్నించారు. కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల పరిస్థితిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఇస్తామన్న తులం బంగారం, విద్యార్థులకు హామీ ఇచ్చిన స్కూటీలు ఎక్కడ ఉన్నాయని ప్రశ్నించా రు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యం కావడానికి కారణమేంటని నిలదీశారు. యువతకు హామీ ఇచ్చిన జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ ను ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ప్రజ లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ బీఆర్ఎస్ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రసన్న రామ్మూర్తి, రోహిత్, శశిరాజ్, బిట్ల శ్రీనివాస్, రామ్ చందర్, రావుల విజయ్ కుమార్, ప్రభాకర్ రెడ్డి, సారంగా పాణి, నిశాంత్ ముదిరాజ్, గజ్జల ఆనంద్, మేఘన, శ్రీనివాస్ నాయుడు, నరసింహ, వెంకీ ముదిరాజ్, శ్రీనివాస్, విజయలక్ష్మి, ఆంజనేయులు, పాతర్ల నరసింహ, యూసుఫ్, ముర్తుజ, అయూబ్, నవీన్, గణేష్, దన్ను రాజ్, శ్రీకాంత్, విశాల్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# నాన్న జ్ఞాపకార్థం ఆకలి తీర్చిన తనయుడు

## మల్కాపూర్‌లో ఆర్.ఎస్.కే ఫౌండేషన్ మానవతా సేవ



**తాండూరు సెప్టెంబర్ 4(జనంసాక్షి) :** ఆర్.ఎస్.కే ఫౌండేషన్ చైర్మన్ రొంపల్లి సంతోష్ కుమార్ తండ్రి కీ.శే. రొంపల్లి కిష్టయ్య జన్మదినం సందర్భంగా శు క్రవారం తాండూరు మండలం మల్కాపూర్ గ్రామంలో సేవా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో అవసరం ఉన్న పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మల్కాపూర్ మాజీ ఎంపిటిసి రఘునాథ్ రెడ్డి, జింగుర్తి సర్పంచ్ శరణ్, ఫౌండేషన్ సభ్యులు అగిరు మహేష్, సోము, సత్య, గురు, నరేష్, తర్లపల్లి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. కీ.శే. కిష్టయ్య ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఏటా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని, పేదలకు అండగా ఉంటామని తెలిపారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రధాన చౌరస్తాలో నిరసన



**శంకర్ పల్లి, సెప్టెంబర్ 4(జనం సాక్షి) :** బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి ప్రధాన చౌరస్తాలో శుక్రవారం మండల, మున్సిపల్ బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో వృద్ధులు, వికలాంగులు, మహిళలతో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల, మున్సిపల్ అధ్యక్షులు అధ్యక్షులు గండిచేర్ల గోవర్ధన్ రెడ్డి, బద్దం శశిధర్ రెడ్డి లు మాట్లాడుతూ..ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. మహిళలకు నెలకు రూ.2500, తులం బంగారంతో కూడిన కళ్యాణ లక్ష్మీ,షాదీ ముబారక్, కేసీఆర్ కిట్ పథకాలను ఎత్తేసి మహిళలను మోసం చేసిందని,అలాగే విద్యార్థులకు స్కూటీలు ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదని ఆరోపించారు. పేదల సంక్షేమం కోసం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, దీనికి నిరసనగా ప్రజల్లోకి వెళ్లి చైతన్యం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు,గోవర్ధన్ రెడ్డి,నర్సింలు మరియు బిఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రూ.2,500, తులం బంగారం హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించింది

**తాండూరులో వంటావార్పు కార్యక్రమంలో పైలట్ రోహిత్ రెడ్డి**



**తాండూరు సెప్టెంబర్ 4(జనంసాక్షి) :** బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తాండూరు పట్టణంలోని భద్రేశ్వర కూడలిలో నిర్వహించిన వెయ్యి రోజుల పాలనపై వృద్ధులు, వికలాంగులు, మహిళలతో సదస్సులో వంటా వార్పు కార్యక్రమంలో పైలెట్ రోహిత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మహిళలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రతి మహిళకు ప్రతినెలా రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రతి మహిళను మహాలక్ష్మిని చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకాన్ని అమలు చేసి మహిళలు బస్సుల్లో ఇబ్బందులు పడే పరిస్థితి తీసుకొచ్చారని విమర్శించారు.తాండూరు నుంచి మహబూబ్‌నగర్‌కు వెళ్లడానికి బస్ స్టాండ్‌కు వెళ్తే గంటల తరబడి నిలబడినా బస్సులు రావడం లేదని అన్నారు.రూ.500కే గ్యాస్ సిలిండర్ పది మంది మహిళలకు ఇచ్చి అందరికి ఇచ్చినట్లు చెబుతున్నారని అన్నారు. హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేస్తోందని విమర్శించారు. మహిళలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత పెళ్లి చేసుకున్న వారిలో ఒక్కరికైనా తులం బంగారం వచ్చిందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 1000 రోజులు అవుతుందని, మరి మహిళలను కోటీశ్వరులను ఎప్పుడు చేస్తారని ప్రశ్నించారు.ఆసరా పెన్షన్‌ను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను అన్నింటినీ మరచిపోయిందని అన్నారు.మహిళల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని పైలట్ రోహిత్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో కరువు రాజ్యం

**ప్రజల ఆశలను వంచించిన ప్రభుత్వం**

**ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఏమయ్యాయి**

**రూ.500కే గ్యాస్ పోయి రూ.1,050 భారం**

**ఆరుట్లలో ఘనంగా బీఆర్ఎస్ నిరసన**



**రంగారెడ్డి, సెప్టెంబర్ 4 (జనంసాక్షి)**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు పూర్తయినప్పటికీ, రాష్ట్రంలో అభివృద్ధి కరువై కరువు పరిస్థితులు తాండవిస్తున్నాయని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి రావడానికి ఆరు గ్యారంటీలు, 420 హామీలు గుప్పించిన కాంగ్రెస్, నేడు వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం, ఆరుట్ల గ్రామంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో తులం బంగారం, మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, మహిళలకు ఉచిత స్కూటీలు, పెన్షన్ల పెంపు, బీసీ బంధు, ఎస్సీ బంధు, కేసీఆర్ కిట్ వంటి సంక్షేమ పథకాలను నిలిపివేసి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని చెప్పి మోసం చేశారని, నేడు ప్రజలు రూ.1,050 వెచ్చించి అధిక ధరలకు సిలిండర్లు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొందని విమర్శించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులు తప్ప, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కొత్తగా చేసిందేమీ లేదని స్పష్టం చేశారు. గ్రామాల్లో ప్రజలు ఎక్కడికక్కడ కాంగ్రెస్ నాయకులను హామీలపై నిలదీస్తున్నారని, ఇచ్చిన మాటపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికార పార్టీ ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలే తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనతో విసిగిపోయిన తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని, సంక్షేమ పాలనను కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ చంద్రయ్య, మాజీ ఎంపీపీలు నర్మదా, ఇందిరా ,కృపేష్,లక్ష్మారెడ్డి, దండం రాంరెడ్డి, బూడిద రాంరెడ్డి,సికిందర్ రెడ్డి పుల్లారెడ్డి జ్ఞానేశ్వర్,కర్నాటి రమేష్, కిషన్ గౌడ్,బద్రీనాథ్, రాజు నాయక్,తీ సుకన్యశేఖర్ రెడ్డి ,అనిత వెంకటేష్ గౌడ్,శోభా కుమార్,రఘుపతి శేఖర్, పున్నం రాము, బైరని మహేందర్ పాల్గొన్నారు.

# అధికార కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీల వైఫల్యం పై విరుచుకుపడ్డ బిఆర్ఎస్

### రైతుల సంక్షేమాన్ని గాలికొదిలేసిన ప్రభుత్వం

### ఇది ప్రజా పాలన కాదని, ప్రజా వంచన పాలన అని ధ్వజమెత్తిన బిఆర్ఎస్ నేతలు



**మర్పల్లి సెప్టెంబర్ 03 (జనంసాక్షి)** రాష్ట్రంలో సాగుతున్నది ప్రజా పాలన కాదని, ప్రజా వంచన పాలన అని బిఆర్ఎస్ పార్టీ నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికల సమయం లో 6 గ్యారంటీలు 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు 1000 రోజులు గడుస్తున్న హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి 1000 రోజులు పూర్తయిన ఇచ్చిన 6 గ్యారంటీల విఫలమైందని నిరసిస్తూ రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ కమిటీ పిలుపుమేరకు గురువారం మర్పల్లి మండల కేంద్రంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని పాత బస్టాండ్ నుండి కొత్త బస్టాండ్ వరకు ఈ ర్యాలీని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీమంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అధికారం చేపట్టిన 100 రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, పాలన పై అవగాహన లేక ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని వారన్నారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న పదేళ్లలో రైతు బీమా, రైతు బంధు, ఉచిత విద్యుత్, ఆసరా పింఛన్ తో సంక్షేమ రాజ్యాన్ని అందిస్తే, రేవంత్ రెడ్డి పాలనలో రైతులు, బీడీ కార్మికులు నిరుద్యోగులు ఆటో డ్రైవర్లు వంచనకు గురవుతున్నారన్నారు. మహిళలకు నెలకు ?2,500, ఆసరా పింఛన్ 4 వేలు, వికలాంగులకు 6 వేలు రూపాయలను , 2 లక్షల రుణమాఫీ అని అధికార పార్టీ మోసం చేసిందని, రైతులకు మార్కెట్లో సరిపడా యూరియా దొరకక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ బీసీ కమిషన్ మెంబర్ శుభప్రద పటేల్, మాజీ జెడ్పిటిసి మధుకర్, మండల పార్టీ అధ్యక్షుడు, రావులపల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, వైస్ ఎంపీపీ మోహన్ రెడ్డి, పట్లూరు మాజీ సర్పంచ్ ఇందిరా అశోక్, మిత్ర, గఫార్, కాజా, జంగం సంగమేశ్వర్, మండల పార్టీ నాయకులు, మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నాయక్ గౌడ్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీల అమలేది?

### వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి విమర్శలు



**అల్వాల్, సెప్టెంబరు 4(జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఓల్డ్ అల్వాల్ లేబర్ అడ్డా వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి, సబితా అనిల్‌కిషోర్ తదితరులు పాల్గొన్నారు. తొలుత నిర్వహించిన వంటా వార్పులో శాంతి శ్రీనివాసరెడ్డి, డోలి రమేష్, శ్రీధర్‌గౌడ్, శ్రీనివాస్, శోభన్‌బాబు, మోసిన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అయితే వాటిని నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయలేదని విమర్శించారు. పేదింటి ఆడపడుచులకు ఇస్తామన్న తులం బంగారం ఏమైందని ప్రశ్నించారు. హామీలతోనే వెయ్యి రోజులు గడిపారని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నందికంటి శ్రీధర్, శాంతి శ్రీనివాసరెడ్డి, సబితా అనిల్‌కిషోర్, డోలి రమేష్, అనిల్‌కిషోర్, గౌడ్, శ్రీధర్‌గౌడ్, శరణ్, గిరి, భాస్కర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శోభన్‌బాబు, శ్రీనివాస్ తదితరులతోపాటు పెద్ద సంఖ్యలో మహిళలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# పేద ప్రజలకు కాంగ్రెస్ కొండంత అండా

### శామీర్‌పేటలో కాంగ్రెస్ 1000 రోజుల పాలన విజయోత్సవ బైక్ ర్యాలీ

### ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్

**శామీర్‌పేట, సెప్టెంబర్ 4 (జనంసాక్షి) :** కాంగ్రెస్ 1000 రోజుల పాలన విజయోత్సవ బైక్ ర్యాలీని శామీర్‌పేట డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్ ఆధ్వర్యంలో జెండా ఊపి ప్రారంభించారు. శామీర్‌పేట వైఎస్ఆర్ చౌరస్తా నుండి బాబాగూడా, బొమ్మరాసి పేట్, ఉప్పర్ పల్లి, దొంగల మైసమ్మ, తూంకుంట, పోతాయిపల్లి, దేవరయంజాల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నక్క ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన విజయోత్సవాలతో ప్రతి ఇంట పండుగ వాతా వరణం నెలకొందన్నారు. సన్న బియ్యం, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, తదితర సంక్షేమ పథకాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని వివరించారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా ఉన్నారని రాబోయే ఎన్నికల్లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మేయర్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ దక్కించుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టిఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, శామీర్‌పేట డివిజన్ అధ్యక్షుడు నక్క సందీప్ గౌడ్, నాయకులు శంకర్ గౌడ్,సింగిరెడ్డి మధుసూదన్ రెడ్డి, ఎద్దు నగేష్ యాదవ్, మ్యాకల మహేందర్ యాదవ్, విలా సాగరం అశోక్, శ్రీనివాస్ రెడ్డి, దప్పు సాయిబాబు, వంగ నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌లో విధిగా పాల్గొని ఓటు హక్కుని కాపాడుకోవాలి

### బీసీ సమాజ్ రాష్ట్ర యువజన కార్యదర్శి నరుకుడు బిందెల మల్లిఖార్జున్



**షేక్‌పేట్ (జనంసాక్షి) :** ఎస్ ఐ ఆర్ నోటీసులు అందుకున్న ఓటర్లు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ వర్డ్ ఆఫీస్ 94 సర్కిల్ 18 షేక్పేటలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో వెరిఫికేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు, 30 వార్డులకు సంబంధించిన ఓటర్లు వివిధ గుర్తింపు పత్రాలతో హాజరై బిఎల్ఓల సమక్షంలో సంబంధిత డాక్యుమెంట్లను అందజేసి ఆన్లైన్లో ఫోటో కాపీలను వ్యక్తుల యొక్క ఫోటోలను అప్లోడ్ చేస్తూ వెరిఫికేషన్ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు చాలా విలువైనదని ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్ ప్రక్రియను ఉపయోగించుకొని ఎలాంటి సందేహాలున్న, సమస్యలు ఉన్న నివృత్తి చేయడానికి బిఎల్వోలు మీకు అందుబాటులో ఉంటారని, ప్రతి ఒక్కరూ సంబంధిత పత్రాలను సమర్పించి ఓటు హక్కును విధిగా పొందాలని ఎస్ ఐ ఆర్ నమోదు సెంటర్ను పరిశీలించిన బీసీ సమాజ్ రాష్ట్ర యువజన కార్యదర్శి నరుకుడు బిందెల మల్లికార్జున్ అన్నారు, తనతో పాటుగా పాల్గొన్న యువజన నాయకులు మురళీ, సంతోష్, రవి, రాజేష్, శ్రీను, శేఖర్, మరియు స్థానిక నాయకులు యువకులు పాల్గొన్నారు.



# అట్టహాసంగా అలియాబాద్‌లో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన చామకూర మహేందర్ రెడ్డి

**శామీర్‌పేట, సెప్టెంబర్ 4 (జనంసాక్షి) :** స్వర్గీయ కీ.శే.బండి రాఘవరెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని ఆయన జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ ను బిఆర్ఎస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ చామకూర మహేందర్ రెడ్డి ప్రారంభించారు. బిఆర్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఫౌండర్ బండి రామిరెడ్డి, శ్రీకర్ రెడ్డి ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించే ఈ టోర్నమెంట్ లో అలియాబాద్ మున్సిపాలిటీ నుండి 18 జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. స్వర్గీయ రాఘవరెడ్డి అలియాబాద్ గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, గ్రామ ప్రజలకు ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. శనివారం జరిగే రాఘవరెడ్డి వర్ధంతి సందర్భంగా విజేతలకు నగదు బహుమతిని అందజేయనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గుర్కకుమార్ యాదవ్, గాదె వెంకటేష్, నాయకులు గూదె ఎల్లయ్య, మధుసూదన్ రెడ్డి, తాడెం కుమార్, వంగ వెంకట్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**మల్కాజిగిరి సెప్టెంబర్ 4 (జనంసాక్షి) :** అష్టభుజా దేవి ఆలయం వద్ద యశోదా బాలగోకులం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నెల రోజులుగా ప్రతిరోజు నిర్వహించే శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఈరోజు తో ముగియడంతో కృష్ణుడి వేషంలో చిన్నారులు ఆటలతో అలరించి ఉట్టి పగలగొట్టారు. యశోద బాలగోకులం ఆధ్వర్యంలో అష్టభుజాదేవి గుడి నుండి శ్రీకృష్ణుడి విగ్రహంతో ఊరేగింపుగా బయలుదేరి విష్ణుపురి మీదగా ఆనంద్ బాగ్ నుండి అష్టభుజ దేవి గుడి వరకు ఊరేగింపు ఘనంగా సాగింది. శ్రీకృష్ణుడు రాధా వేషాలలో పిల్లలు అందరిని అలరించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ శ్రవణ్ , యశోద బాలగోకులం సభ్యులు విపిన్, దీపా వాసుదేవన్ , బాబు , కన్నన్ , దాసన్ , ఉమేష్ , రవి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**నిజాంపేట్ సెప్టెంబర్ 4 జనంసాక్షి :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ గోకుల్ యాదవుల ఆధ్వర్యంలో హెచ్ఎంటి గ్రౌండ్స్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఎంతో వైభవంగా నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ముఖ్య అతిథిగా జే.కే. శేఖర్ యాదవ్ పాల్గొన్నారు. అనంతరం శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా భరతనాట్యం విద్యార్థుల అద్భుతమైన ప్రదర్శనలను వీక్షించి, వారి ప్రతిభను అభినందిస్తూ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యాదవ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్, లక్ష్మణ్ యాదవ్ , యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధిలో సంక్షేమ సంఘాలకు సహకారం ఇస్తాం

### బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

**నిజాంపేట్ (జనంసాక్షి) :** కుత్బుల్లాపూర్131 డివిజన్ శ్రీనివాస్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంక్షేమ సంఘం సభ్యులు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ని శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాలకు నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే కేపీ వివేకానంద తెలిపారు.. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు ఈశ్వర్ గౌడ్, కమిటీ సభ్యులు విలాస్ రావు, నర్సాగౌడ్, కృష్ణయ్య, ప్రభు, కృష్ణమోహన్, సత్తిరెడ్డి, వెంకటేష్, మురళి, శంకర్, మల్లికార్జున్, రామకృష్ణంరాజు, కాలనీ యువకులుపాల్గొన్నారు.

## పులుమామిడి గ్రామంలో ప్రీ ప్రైమరీ స్కూల్‌లో శ్రీకృష్ణ రాధా గోపికల వేష ధారణలో చిన్నారులు



**నవాబుపేట్ సెప్టెంబర్ 4 ( జనం సాక్షి) :** నవాబుపేట్ మండల పరిధిలోని పులుమామిడి గ్రామంలో ప్రాథమిక ప్రైమరీ పాఠశాలలో ప్రధానోపాధ్యా యులు వెంకటయ్య ఆధ్వర్యంలోశు క్రవారం కృష్ణాష్టమి వేడుకలు సందర్భంగా ప్రి ప్రైమరీ పాఠశాలలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలోఅత్యంత వైభవంగా కోలాహలంగా జరిగాయి. ఈ వేడుకలలో చిన్నారి విద్యార్థులు నారే గూడెం ప్రణవి, నారే గూడెం వియన్స్ శ్రీకృష్ణుడు రాధా గోపికల వేషధారణలో అలరించారు. నెమలి పించాలు. మురళీలు అలంకారాలతో విద్యార్థులు కనువిందు చేశారు. సంస్కృతి కార్యక్రమంలో శ్రీకృష్ణుడు బాల్య లీలాలను గుర్తు చేసేలా చిన్నారుల నృత్యాలు, భక్తి గీతాలు, ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించారు. ఉట్టి కొట్టే కార్యక్రమం పాఠశాల ప్రాంగణంలో సాంప్రదాయ బద్ధంగా ఉత్తి కొట్టే కార్యక్రమాలను ఉత్సాహంగా జరిపారు. ఇందులో పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రాముఖ్యత వివరణ భారతీయ కృత సాంప్రదాయాలు పండుగల విశిష్టతను శ్రీ కృష్ణుడు జన్మ వృత్తాంతాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయులు పేరెంట్స్ కమిటీ విద్యార్థుల తల్లిదండ్రులుపాల్గొన్నారు.

**బొంరాస్‌పేట మండలం నాందార్ పూర్ గార్గి విద్యానికేతన్‌లో కృష్ణాష్టమి సందర్భంగా గోపికల మధ్యలో చిన్ని కృష్ణుని లీలలు**



## లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**నిజాంపేట్ సెప్టెంబర్ 4 జనం సాక్షి :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధి దుండిగల్ సర్కిల్ 294 డివిజన్ డబుల్ బెడ్ రూమ్స్,డి.పోచంపల్లికి చెందిన పలువురు పేద ప్రజలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఖర్చులకు సరిపడా ఆర్థిక స్థోమత లేక వివిధ సమస్యలను ఎదుర్కొంటు వారు రాష్ట్ర ప్రోటోకాల్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డిని సంప్రదించగా,ఆయన వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం మంజూరు చేయించారు.అనంతరం శు క్రవారం బొంగునూరి కిషోర్ రెడ్డి ఆయన కార్యాలయం నందు లబ్ధిదారులు గశీడిమైస్సమ్మ అబ్దుల్ రెహమాన్ డి.పోచంపల్లి ఉమాకాంత్ కి (పంతులు) వారి చేతుల మీదగా సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరి పత్రాలు (చెక్కులు) అందజేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రోటోకాల్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నర్సింహా రెడ్డి, గంట శివారెడ్డి, లింగం గౌడ్, తిరుపతి రెడ్డి, కృష్ణ, మహేష్,టీమ్ బికెర్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## మాదిగలు సంఘటితం కావాలి : దండోరా జాతీయ నాయకుడు ఎన్ వై అశోక్

### శామీర్ పేట్ ఎమ్మార్పిఎస్ గ్రామ శాఖ అధ్యక్షులుగా కొమ్ము వెంకటేష్ నియామకం



**శామీర్‌పేట్, సెప్టెంబర్ 4(జనం సాక్షి ) :** ఎంఆర్ పిఎస్ సంస్థాగత నిర్మాణంలో భాగంగా శామీర్ పేట గ్రామంలో దండోరా జాతీయ కళామండలి నాయకులూ ఎన్. వై.అశోక్ మాదిగ ఆధ్వర్యంలో మాదిగ యువకులతో సమావేశం ఏర్పాటు చేసిన సీనియర్ నాయకులూ అద్రస్ పల్లి చంద్రశేఖర్ మాదిగ ఆధ్వర్యంలో గ్రామ నూతన కమిటీ ఏర్పాటు చేశారు.ఎంఆర్ పిఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడుగా కొమ్ము వెంకటేశ్, అధికార ప్రతినిధిగా కిషన్, ప్రధానకార్యదర్శిగా శ్రీకాంత్, మధు, ఉపాధ్యక్షులు నితిన్, మధు, రాకేష్, కోశాధికారి విజయ్, శ్రీకాంత్, మహేష్, ఎం.ప్రసాద్, నరేష్, వినయ్ సాయికుమార్, శ్రీను, బాలనరసింహ, భాస్కర్ లను ఎన్నుకున్నారు. అనంతరం ఎన్ వై.అశోక్ మాదిగ , చంద్రశేఖర్ మాదిగలు మాట్లాడుతూ..పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఎంఆర్పీఎస్ ఉద్యమాన్ని నిర్మాణాన్ని నూతన మాదిగ యువతతో జిల్లాలో బలోపేతం చేసి ప్రజా సమస్యలమీద పోరాడుతామని అన్నారు.

## కాంగ్రెస్ మోసపూరిత పాలనపై మహిళల గళం

### చేవెళ్లలో భారీ వంటా-వార్పు నిరసన

**హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సబితా ఇంద్రారెడ్డి విమర్శ**



**చేవెళ్ల, సెప్టెంబర్ 4 (జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన ఏడు రోజుల నిరసన పిలుపులో భాగంగా చేవెళ్ల నియోజకవర్గంలో మూడో రోజు భారీ వంటా-వార్పు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. శంకర్‌పల్లి చౌరస్తాలోని గుండం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు, వృద్ధులు, వికలాంగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ అధ్యక్షతన, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో రోడ్డుపైనే పొయ్యిలు ఏర్పాటు చేసి వంటా-వార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. మహిళలకు ప్రభుత్వం రూ.82 వేల బకాయి పడిందని పేర్కొంటూ, కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో ఓట్లు అడగడానికి వచ్చినప్పుడు ఆ బకాయి చెల్లించిన తర్వాతే మాట్లాడాలని ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం హామీ ఏమైంది? అని ఆమె ప్రశ్నించారు. ఆడబిడ్డల వివాహాలకు కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి, ఆ తర్వాత ఆ హామీని అమలు చేయలేదని విమర్శించారు. రూ.4 వేల పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి వృద్ధులు, వికలాంగులు, వితంతువులను మోసం చేశారని విమర్శించారు. పాత పెన్షన్ రూ.2 వేలు కూడా సక్రమంగా అందడం లేదని, పెన్షన్‌దారులకు ప్రభుత్వం బకాయి పడిందని ఆరోపించారు. ప్రభుత్వం ఎంత బకాయి పడిందో ప్రజలకు తెలియజేసేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'బాకీ కార్డులు' పంపిణీ చేస్తున్నామని తెలిపారు. వికలాంగులకు రూ.6 వేల పెన్షన్ ఇస్తామని ఇచ్చిన హామీని కూడా ప్రభుత్వం విస్మరించిందని అన్నారు. 18 ఏళ్లు నిండిన విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు ఇస్తామని ఇచ్చిన హామీని సైతం అమలు చేయలేదని విమర్శించారు. పాలనలో విఫలమై, ఎప్పుడు మైక్ పట్టుకున్నా కేసీఆర్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి దేశమల్ల ఆంజనేయులు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణా రెడ్డి, రాష్ట్ర నాయకుడు విజయ ఆర్య క్షత్రియ, కౌన్సిలర్లు శ్రీనివాస్ రెడ్డి, కుర్వ మంగమ్మ మల్లేష్, డప్పు సువర్ణ చందు, కౌన్సిలర్ మల్లేష్, మహిళా నాయకులు పెద్దోళ్ల సుజాత, లక్ష్మీ ప్రసన్న శేఖర్, తలారి స్వాతి యాదయ్య, దండు లత సత్యనారాయణ, పెద్దోళ్ల విజయలక్ష్మి, నత్తి లావణ్య కృష్ణారెడ్డి, రాధిక మల్లేష్, మహిళా విజయభాస్కర్ రెడ్డి, మిట్ట రంగా రెడ్డి, మల్లా రెడ్డి, బ్యాగరి సుదర్శన్, పూలపల్లి పృథ్వీ, రఘు, నరేందర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, రాంప్రసాద్, చాకలి గూడెం పాండు, ఉరడి నర్సింహులు, మాధవ్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, రవికుమార్, మాజీ సర్పంచ్ జంగా రెడ్డి, శేరీ శివా రెడ్డి, పెద్దోళ్ల గోపాల్, ఆలూరు మాజీ సర్పంచ్ నర్సింహులు పాల్గొన్నారు.